క్లుప్తంగా

డైరీల ఆవిష్కరణ



డైరీలను అందజేస్తున్న జడ్జి

కొత్తగూడెంటౌన్: జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం జిల్లా జడ్జి పాటిల్ వసంత్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్, ఎక్స్ అసిస్టెంట్ సొలిసిటర్ పత్తి విష్ణువర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా నూతన సంవత్సర డైరీలను ఆవిష్కరించి న్యాయవాదులకు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రావిలాల రామారావు, సంయుక్త కార్యదర్శి కాసాని రమేష్, లైబ్రరీ సెక్రటరీ వై.నాయుడు, క్రీడల కార్యదర్శి పిట్టల రామారావు, కోశాధికారి సంతోష్‌సాహూ, పీపీ పి.రాధాకృష్ణమూర్తి, అదనపు పీపీలు రావి విజయ్‌కుమార్, వెలగల నాగిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు వట్టికొండ సురేష్‌బాబు, బి.రామచంద్రయ్య, రేపాక వెంకటరత్నం, నిమ్మల సోమిరెడ్డి, వై.రామారావు, ఊటుకూరి పురుషోత్తంరావు, అనుబ్రోలు రామారావు, సూరపాని విజయభాస్కర్‌రెడ్డి, మనోరమ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్సై



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సీఐ, ఉద్యోగులు

కొత్తగూడెంటౌన్/పాల్వంచరూరల్: కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఎస్‌ఐ భూక్యా శ్రీనివాస్ పాల్వంచ రూరల్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. పాల్వంచలో విధులు నిర్వర్తిస్తున్న కార్తీక్‌ను ఎస్పీకి అటాచ్ చేయగా, ఆయన స్థానంలో శ్రీనివాస్‌ను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్‌తో పాటు సిబ్బంది శ్రీనివాస్‌ను సన్మానించగా, ఆయన పాల్వంచలో బాధ్యతలు స్వీకరించారు.

నేడు ప్రజాపాలన గ్రామసభలు


ఇల్లెందు: ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా శనివారం పట్టణంలో మూడు వార్డులలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నవీన్ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని 4, 5, 6వ వార్డులలో గ్రామసభలు ఉంటాయని తెలిపారు. ఇందుకు మున్సిపల్ యంత్రాంగం తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తరలి వచ్చి వినతులు అందజేయాలని కోరారు.

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఐదు పంచాయతీలలో శనివారం ప్రజా పరిపాలన గ్రామసభలు జరగనున్నామని ఎంపీడీఓ రమేష్ శుక్రవారం తెలిపారు. లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయం, చాతకొండ దర్గ ఎదురు ఖాళీ స్థలం, హమాలీ కాలనీ గ్రామ పంచాయతీ కార్యాలయం, సాటివారిగూడెం గ్రామ పంచాయితీ కార్యాలయం, శేషగిరినగర్ ప్రైమరీ స్కూల్‌లో ప్రజా గ్రామ సభలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సుజాతనగర్: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా లక్ష్మీదేవిపల్లి, 2 ఇంక్‌లైన్, బేతంపూడి గ్రామపంచాయతీ కార్యాలయాల్లో శనివారం గ్రామసభలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మూడు గ్రామాల పరిధిలో 11 కౌంటర్ల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు.

టేకులపల్లి: ప్రజాపాలనలో భాగంగా శనివారం జరిగే గ్రామసభల వివరాలను ఎంపీడీవో కోట వీరబాబు శుక్రవారం వెల్లడించారు. ప్రైగళ్లపాడు, గోల్యాతండా, చింతోనిచెలక, చంద్రుతండా, పెట్రాంచెలక, రాంపురం పంచాయతీల్లో గ్రామసభలు గ్రామసభలు ఉంటాయని తెలిపారు. ప్రజలు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌లు, పాస్ ఫొటోతో దరఖాస్తులను అధికారులకు అందజేయాలని కోరారు .

టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు
రాంబాబు, యాకూబ్ పాషా

పాల్వంచరూరల్: టీఎస్ యూటీఎఫ్ పాల్వంచ మండలశాఖ మహాసభలో ఎన్నికల అధికారి మల్లెంపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్కే యాకూబ్‌పాషా, ఉపాధ్యక్షుడిగా బి.మంగీలాల్, ఎస్ సిల్వియా, కోశాధికారి ఎ.నర్సింహారావు, కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, ఎస్కే రహీముద్దీన్, కె.సంతోష్, బి.వెంకన్న, ఎ.విజయభాస్కర్, పి.సత్య,శ్రీదేవి, ఎస్.రాజులు, ఎం.వీరస్వామి, జి.హరి, ఆడిటర్లుగా ముత్తయ్య, మీడియా కన్వీనర్ బి.మంగీలాల్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా ఎస్కే రహీముద్దీన్ ఎన్నికయ్యారు.

ఆధార్ అప్‌డేట్‌కు అవస్థలు..

- అదనపు చార్జీలు వసూలు చేస్తున్న నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు



ఆధార్ అప్‌డేట్ కోసం సుజాతనగర్ ఏపీజీవీబీ బ్యాంకులో బారులు తీరిన జనం

సుజాతనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనపై దృష్టి సారించింది. ఈ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేయనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఆధార్, గ్యాస్ వినియోగం నిమిత్తం ప్రజలు ఈ కేవైసీ చేయించుకునేందుకు ఆధార్ సెంటర్, మీ సేవా కేంద్రం వద్ద బారులు తీరుతున్నారు. ఆధార్ కార్డులో రాష్ట్రం, జిల్లా, మండలం తదితర మార్పుల విషయంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు లేవని మరోవైపు అధికారులు అంటున్నారు.

ఆధార్ సవరణల కోసం...

కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం మహాలక్ష్మి, చేయూత తదితర పలు పథకాలను అమలు చేస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆయా పథకాలు పొందేందుకు ఆధార్ నంబరు కూడా కీలకం కావడంతో వాటి సవరణ కోసం ప్రజలు తిప్పలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆధార్ కార్డుల్లో చాలావరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఖమ్మం జిల్లానే ఉన్నాయి. దీంతో వాటిని మార్చుకునేందుకు ప్రజలు ఉదయమే ఆధార్ సెంటర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు మహాలక్ష్మి పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తున్నారు. దీంతో ఆధార్ కార్డులో రాష్ట్రం, జిల్లా, మండలం పేర్లను మార్చుకునేందుకు ఆధార్ సెంటర్ల వద్ద ప్రజలు క్యూ కడుతున్నారు. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా... మండలం మొత్తానికి ఒకే ఆధార్ సెంటర్ ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఆధార్ అప్‌డేట్ కోసం బ్యాంకు తెరవక ముందే ఆయా గ్రామాల ప్రజలు వచ్చి క్యూ కడుతున్నారు. రోజులో కేవలం 40 మందికి మాత్రమే అప్‌డేట్ చేస్తుండంతో మిగిలినవారు వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితి. సర్వర్ రావడం లేదని, నెట్ పనిచేయడం లేదని తిప్పి పంపుతున్నారు.

ఈ కేవైసీ పుకార్లతో...

వంట గ్యాస్ వినియోగదారులు ఈ కేవైసీ చేయించుకోవాలంటూ సామాజిక మాధ్యమాల్లో కొద్ది రోజులుగా పుకార్లు షికార్లు చేస్తుండటంతో పల్లెల్లోని ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ కేవైసీ చేయించుకోకుంటే రూ.500 గ్యాస్ రాదనే వదంతులు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన గ్యాస్ వినియోగదారులు కొత్తగూడెంలోని గ్యాస్ ఏజెన్సీల వద్దకు పరుగులు పెడుతున్నారు. గ్యాస్ పుస్తకంలో యజమాని పేరు పురుషుని పేరు ఉండటంతో వాటిని మార్చుకోవాలని, లేదంటే ఈ పథకానికి అనర్హులని పుకారు పట్టించారు. అయినా కొందరు పురుషుల పేరుకు బదులుగా మహిళల పేరు మార్చేందుకు దళారులను కూడా ఆశ్రయిస్తున్న పరిస్థితి.

అదనపు బాదుడు...

మండల కేంద్రంలో ఏపీజీవీబీ బ్యాంకులో ఒక ఆధార్ సెంటర్ ఉండగా.. దీనికి సమీపంలో ఒక మీ సేవా కేంద్రం ఉంది. కులం, ఆదాయం ఇతరత్రా ధృవపత్రాల కోసం మీ సేవా కేంద్రానికి, ఆధార్ కార్డుల్లో మార్పుల కోసం ఏపీజీవీబీ బ్యాంకులోని ఆధార్ కేంద్రానికి ప్రజలు వెళుతున్నారు. ప్రభుత్వం అమలు చేయనున్న పథకాల నేపథ్యంలో ఈ రెండు సెంటర్లలో ప్రస్తుతం ఉదయం నుంచి సాయంత్రం వరకూ తీవ్రమైన రద్దీ నెలకొంటోంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం కాకుండా అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి ఈ కేంద్రాల్లో నెలకొంది. ఆధార్‌లో మార్పుల చేర్పుల నిమిత్తం రూ.50 తీసుకోవాల్సి ఉన్నా... అదనంగా మరో రూ.50 తీసుకుంటున్నారని వినియోగదారులు వాపోతున్నారు. ఎప్పటి నుంచో ఈ దందా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రజలకు నేరుగా సేవ చేయాలనే ఉద్దేశ్యంతో మీ సేవా కేంద్రాలు పెడితే అదనపు దందాను అరికట్టే నాథుడే కరువయ్యాడని, చేసేదేమీలేక అడిగినంత చెల్లించుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు.



జిరాక్స్ సెంటర్ వద్ద రద్దీ

నాలుగు రోజులు తిరిగిన...



నా ఆధార్ కార్డులో తప్పులు సవరించుకునేందుకు నాలుగు సార్లు సుజాతనగర్ వచ్చిన. ఎప్పుడు వచ్చినా చాలామంది ఉంటున్నారు. జిల్లా, మండలం పేరు మార్చుకునేందుకు విసిగి పోయాను. చివరకు మార్చుకున్నాను.

– చెల్లా పెద్దరాములు, నాయకులగూడెం

అవసరం వస్తుందేమోనని..



నాకు ఇంతవరకు కులం, ఆదాయం సర్టిఫికెట్లు లేవు. ఒక వేళ ప్రభుత్వ పథకాలకు అవసరం వస్తోందేమోనని ముందే తీసుకుని ఉంచుకోవాలని దరఖాస్తు చేసేందుకు మీ సేవా కేంద్రానికి వచ్చిన. నాలాగే చాలామంది వచ్చారు.

– గద్దం పూర్ణచందర్‌రావు,సుజాతనగర్

ఆదేశాలు రాలేదు..



ప్రభుత్వ పథకాల నిమిత్తం ఆధార్ కార్డుల్లో మార్పులు చేయాలని ఇప్పటి వరకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఒక వేళ ఆదేశాలు వస్తే ప్రజలకు తప్పకుండా తెలియజేస్తాం. మీ సేవా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలే తీసుకోవాలి.

– జి.శిరీష, తహసీల్దార్, సుజాతనగర్

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయండి



మహాసభలో మాట్లాడుతున్న రాజు

పాల్వంచరూరల్: ప్రభుత్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ మండలశాఖ 10వ మహాసభ కె.రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి రాజు మాట్లాడారు. ఉపాధ్యాయ నియామక పరీక్ష నిర్వహించి ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని, ట్రెజరీలో పెండింగ్‌లో బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ఉన్నత పాఠశాలలో విలువైన సామగ్రి కలిగిన పాఠశాలలకు సెక్యూరిటీ కల్పించాలని, సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను నివారించాలని, విద్యావలంటరీలను నియమించాలని, హెల్త్ కార్డులు అన్ని ఆస్పత్రుల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సభలో జిల్లా కార్యదర్శి మల్లెంపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్స్‌ల నియామకం నిలిపివేయండి



హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజేష్‌నాయక్ తదితరులు

కొత్తగూడెంటౌన్: స్టాఫ్‌నర్స్‌ల ఎంపికను నిలిపివేయాలని కోరుతూ ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్‌నాయక్ శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు విషయాలను విన్నవించారు. తెలంగాణ రాష్ట్ర మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా జరుగుతున్న ప్రొవిజనల్ జాబితా ప్రకారం లేదని తెలిపారు. 1:4 పద్ధతిన కౌన్సెలింగ్‌కు అహ్వానించాలని పేర్కొన్నారు. గత హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు కనుసన్నల్లోనే ఈ నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. తమ వారిని నియమించుకునే విధంగా జాబితా సిద్ధం చేసుకున్నారని ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో గుగులోతు మోహన్‌నాయక్, గుగులోతు కేశవనాయక్, రాందాస్‌రాథోడ్, ఆరుజ్‌నాయక్, గణేష్ నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందాలి



సీతంపేటలో దరఖాస్తు తీసుకుంటున్న జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు



నిమ్మలగూడెంలో ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

సుజాతనగర్: అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. మండలంలోని సీతంపేట గ్రామంలో జరుగుతున్న ప్రజాపాలన సదస్సును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు అధికారులకు అందజేసిన దరఖాస్తులను పరిశీలించారు. మాట్లాడుతూ... అర్హుల నుంచి 6వ తేదీ వరకు జరిగే గ్రామసభల్లో దరఖాస్తులను అధికారులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రజాపాలన గ్రామసభలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గ్రామసభల నిర్వహణ సమాచారం, దరఖాస్తు ప్రతి కుటుంబానికి అందజేయాలని సూచించారు. కాగా నిమ్మలగూడెంలో జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణను కొత్తగూడెం ఆర్డీఓ ఆర్.శిరీష పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. నిరక్షరాస్యుల దరఖాస్తులు నింపేందుకు సహాయం చేయాలన్నారు.

అయ్యప్ప మాలధారుల ఇరుముడి..



జూలూరుపాడు: అయ్యప్పమాలధారులు



టేకులపల్లి రామాలయం వద్ద మాలధారులు

జూలూరుపాడు: జూలూరుపాడు శ్రీసీతారామాలయంలో అయ్యప్పమాలధారుల ఇరుముడి మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. గురుస్వాములు అనుమళ్ల భద్రయ్య, నేరళ్లకుంట శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో తొమ్మిది మంది మాలధారులకు ఇరుముడి కట్టారు. అనంతరం శబరిమలకు ప్రత్యేక వాహనంలో వెళ్లారు.

టేకులపల్లి: 41 రోజుల పాటు కఠోర దీక్ష చేసిన అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం శుక్రవారం మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు బాదావత్ మాన్‌సింగ్, తోటకూరి జయంత్, బోడ మంగీలాల్ స్వాముల ఆధ్వర్యంలో ఇల్లెందు హరిహర క్షేత్రం అర్చకుడు ప్రదీప్‌శర్మ చేత 40 మంది స్వాములకు ఇరుముడి కట్టించారు.

పడిపూజ, అభిషేకం, భజన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇరుముడి నిర్వహించారు. మాలధారులు ఆటపాటలతో భజన చేస్తూ ఊరేగింపుగా శబరిమలైకు బయలుదేరి వెళ్లారు.

ప్రజాపాలన దరఖాస్తుల కొరత రావొద్దు..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు పథకాలు ప్రతి పేదవారికీ అందాలని, దరఖాస్తుల కొరత లేకుండా చూడాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌లో ప్రజా పాలన వార్డు సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలతో పేదల స్థితిగతులు మారనున్నాయన్నారు. గ్రామ, వార్డు సలహాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమకు కావాలిసిన పథకానికి దరఖాస్తు చేసుకుని అధికారులకు అందించాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులను త్వరతిగతిన విచారణ పూర్తి పథకాలు అమలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, డీఈ మురళీ, ఏఈ రాజేశ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, సీపీఐ నాయకులు ముత్యాల విశ్వనాథం, పూర్ణచందర్‌రావు, రాహుల్, నాగరాజు, వెంకటేశ్వర్లు, పాషా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం పీఆర్‌టీయూ నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు సంఘం నాయకులు పలు సమస్యలను వివరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.వేంకటేశ్వరరావు, భానోత్ రవి, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పలు పార్టీల ఆధ్వర్యంలో..

కొత్తగూడెంలోని పలు పార్టీల నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పాతకొత్తగూడెం ఏరియాలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును సన్మానించారు. కాంగ్రెస్, టీడీపీ, ప్రజాపంథా, టీజేఏసీ పార్టీల నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. ఎన్నో పోరాటలు, బలిదానాలతో తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో అందరి హక్కులు సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, చావా పాపారావు, కాంగ్రెస్, టీడీపీ, టీజేఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కనకయ్యకు సన్మానం

టేకులపల్లి: పీఆర్‌టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం కోయగూడెంలోని ఎమ్మెల్యే కోరం కనకయ్యను నివాసంలో కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. ప్రతీనెల 1వ తేదీన జీతాలు, సీపీఎస్ రద్దు, 317 జీఓ సమస్య, పీఆర్‌సీ పెండింగ్‌లో ఉన్న 3 డీఏల మంజూరు సింగరేణి, ఎయిడెడ్, ఐటీడీఏ విభాగాల్లో పనిచేస్తున్న రెగ్యులర్ మరియు కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు ఇప్పటి వరకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, సమస్యలన్నింటినీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించాలని కోరారు.

కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ రవి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుల జహంగీర్ షరీఫ్, నర్సయ్య, టేకులపల్లి మండల అధ్యక్షుడు మోతీలాల్, జిల్లా ఉపాధ్యక్షుడు టి.రవీందర్, రాష్ట్ర కార్యదర్శి విజయనిర్మల, జగన్, జిల్లా కార్యదర్శి, ప్రసాద్, సమ్మయ్య, రాజేష్ ఖన్నా, రమేశ్, వీరన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి

జూలూరుపాడు: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్సీఈఆర్‌టీ స్టేట్ అబ్జర్వర్ ప్రొఫెసర్ కె.రవికాంతారావు అన్నారు. శుక్రవారం మండలంలోని పాపకొల్లు, జూలూరుపాడు, వెంగన్నపాలెం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతోపాటు, జూలూరుపాడు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని కాంతారావుతో పాటు, జిల్లా రిసోర్స్ పర్సన్ రాజశేఖర్, ఏఎంఓ నాగరాజు శేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఫౌండేషనల్ లిట్రసీ అండ్ న్యూమర్సీ (ఎఫ్ఎల్ఎన్) తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను సబ్జెక్టుల వారీగా సామర్థ్యాలు ఎంత వరకు సాధించారనేది పరిశీలించారు. బ్లాక్ బోర్డుపై తెలుగు, ఆంగ్ల పదాలను విద్యార్థుల చేత రాయించడం, చదివించి, లెక్కలు చేయించారు. ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా ఆరు సామర్థ్యాలను ఉపాధ్యాయులు అవలంబిస్తున్నారా? లేదా పరిశీలించడం తోపాటు, రికార్డులు తనిఖీ చేశారు. వర్క్ షీట్లను ఉపాధ్యాయులు దిద్దుతున్నారా ? లేదా హ్యాండ్ బుక్ ఫాలో అవుతున్నారా లేదా గమనించారు. విద్యార్థుల్లో బేస్ లైన్ రీడింగ్, రైటింగ్ స్కిల్స్ పెంపొందించడంతోపాటు, వెనబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం జూలూరుపాడు హైస్కూల్‌లో ఎంఈఓ గుగులోత్ వెంకట్ అధ్యతన జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో స్టేట్ అబ్జర్వర్ రవి కాంతారావు మాట్లాడారు. తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సీతారామారావు, ఎండీ సలీం, ప్రశాంత్, కార్తీక్, పి.సంజీవరావు, హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రామానుజ జీయర్ స్వామి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం కాకర్ల పాలగుట్టపై కొలువైన శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ అభయాంజనేయస్వామి 21 అడుగుల సుధామూర్తి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఈ విగ్రహాన్ని శుక్రవారం త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి ఆవిష్కరించారు. కాకర్ల గ్రామానికి చెందిన సౌమిత్రి శ్రీవాణి శ్రీధరాచార్యులు, సౌమిత్రి నవనీత్ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. తొలుత సౌమిత్రి శ్రీవాణి, శ్రీధరాచార్యులు హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. – జూలూరుపాడు

గ్రామసభలను పర్యవేక్షించిన అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన రెండో రోజు శుక్రవారం గ్రామసభలు కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో పలు గ్రామాలు, మండల కేంద్రాల్లో నిర్వహించారు. ఆయా కేంద్రాలను తహసీల్దార్లు, ఎంపీడీఓలు పర్యవేక్షించారు. ఇంకా దరఖాస్తులు ఇవ్వలేకపోయిన వారు ఉంటే జనవరి 6వ తేదీ వరకు సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శులకు అందజేయాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామల సభలకు హాజరై దరఖాస్తుల తీరును పరిశీలించారు. జనం పెద్ద ఎత్తున తరలివచ్చి దరఖాస్తులు అందించారు. – సాక్షి నెట్‌వర్క్



టేకులపల్లి: కుంటల్ల పంచాయతీలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



చుంచుపల్లి: బాబుక్యాంపులో సూచనలు చేస్తున్న అధికారులు



ఇల్లెందులో దరఖాస్తులు అందజేస్తున్న స్థానికులు



ఇల్లెందురూరల్: లచ్చగూడెంలో...



పాల్వంచరూరల్: బస్వతారక కాలనీలో తహసీల్దార్‌కు దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు



జూలూరుపాడు: రాజారావుపేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ శారద